సాక్షి
నిర్మల్
బుధవారం । 7 । జూన్ । 2023



బాలిక విద్యకు భరోసా

8లో▸

చదవాలనే ఆకాంక్ష ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో చాలా మంది నిరుపేద కుటుంబాలకు చెందిన బాలికలు మధ్యలోనే బడి మానేస్తుంటారు. అటువంటి బాలికలకు కేజీబీవీ విద్యాలయాలు భరోసా ఇస్తున్నాయి.

8 నుంచి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 8 నుంచి 11వ తేదీ వర కు రాష్ట్ర ప్రభుత్వం, మత్స్యశాఖ అధ్వర్యంలో నిర్మల్‌లో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ం(చేప ఉత్పత్తుల ఆ హార మేళా) నిర్వహిస్తున్నట్లు మత్స్యశాఖ అధి కారి నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో చేపల పులుసు, చేపల ఫ్రైతో పాటు వి విధ రకాల చేపల వంటకాలు, ఫిష్ రవ్వ ఫిష్, ఫిష్ పకోడి, ఫిష్ బిర్యానీ, ఫిష్ ఫింగర్, ఫిష్ క ట్లెట్స్, ప్రాన్స్ పకోడి, ప్రాన్ పలావ్ జిల్లా వాసులకు అందుబాటులో ఉంచేలా పది స్టాళ్లను ఏర్పాటు చేస్తామని వివరించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.6 /29.6

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి దేవేంద్రబాబు

భైంసాటౌన్/భైంసారూరల్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని భైంసా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ దేవేంద్రబాబు సూచించారు. పట్టణంలోని ఓవైసీనగర్‌లో, మండలంలోని కోతల్‌గాం గ్రామంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈనెల 10న జరిగే జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజీతో పరిష్కారమయ్యే కేసులతో కోర్టుల చుట్టూ తిరిగి కాలయాపన చేసుకోవద్దన్నారు. రాజీ కుదుర్చుకుని పరిష్కరించుకోవాలని తెలిపారు. చిన్నచిన్న సమస్యలను పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీపీ బి.అరుణ, సంతోష్ కులకర్ణి, భైంసా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘువీర్, సర్పంచు లావణ్య, న్యాయవాది మాధవి ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: కార్పొరేట్ కళాశాలల్లో 2023–24 విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారి వి.రాజేశ్వర్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు ఈనెల 11 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సత్తన్న.. నేనున్నా!

- బీఆర్‌ఎస్ అసమ్మతి నేతకు కేసీఆర్ భరోసా

నిర్మల్: నిర్మల్ నియోజకవర్గంలో భారత రాష్ట్ర సమి తి అసమ్మతి నేతగా కొనసాగుతున్న పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి వల్ల కొండ సత్యనారాయణగౌడ్ ము ఖ్యమంత్రి కేసీఆర్‌ను మంగళవారం కలిశారు. జిల్లాకేంద్రంలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్న కేసీఆర్ ఆయనను హైదరాబాదు వచ్చి కలవమని చెప్పారు. ఈ మేరకు ఎంపీ జోగినపల్లి సంతోష్‌రావుతో కలిసి సత్యనారాయణగౌడ్ ముఖ్య మంత్రి వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా రాజకీయ భవిష్యత్తు విషయంలో తనపై భరోసా ఉంచాలని, నీకు అండగా నేనుంటానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్‌లోనే కొనసాగాలని, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని సీఎం సూచించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన భరోసా మేరకు పార్టీలోనే కొనసాగనున్నట్లు సత్యనారాయణగౌడ్ తెలిపారు. సీనియర్ నేతలు హరీశ్‌రావు, వడ్డీ రాజేందర్‌రెడ్డి మరికొందరు అసమ్మతి నేతలు కూడా సీఎం హామీ మేరకు పార్టీలో కొనసాగనున్నట్లు తెలిసింది.

చెరువుల పండుగ ఘనంగా నిర్వహించాలి

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8వ తేదీన ఊరూరా చెరువుల పండుగ గ్రామాల్లో ఉన్న చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి సంబంధిత శాఖ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమాలపై రోజువారీ డాక్యుమెంటరీ సిద్ధం చేయాలన్నారు. చెరువుల పండుగ కార్యక్రమంలో చెరువుల వద్ద ఉన్న ఆలయాలకు (కట్ట మైసమ్మ) ప్రత్యేక పూజలు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి భోజనం ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈనెల 8న మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఫిష్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి..

నూతనంగా ప్రారంభించుకున్న సమీకృత కలెక్టరేట్‌లో త్వరలో ఆయా శాఖలు షిఫ్ట్ కావాలని శాఖల వారీగా కేటాయించిన చాంబర్‌లో విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతీ చాంబర్‌లో కరెంట్ మీటర్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.

కిష్టాపూర్ వీడీసీపై ఎస్పీకి ఫిర్యాదు

లోకేశ్వరం: మండలంలోని కిష్టాపూర్ వీడీసీపై లోకేశ్వరం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సభ్యులు ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. లోకేశ్వరం, కిష్టాపూర్ గ్రామానికి చెందిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం 1982లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కిష్టాపూర్ చెరువుకు సంబంధించిన జిల్లా మత్స్యశాఖకు రుసుము చెల్లిస్తున్నారు. ఈ ఏడాదిలో కిష్టాపూర్ చెరువులో చేపలను పట్టడానికి వెళితే వారిని వీడీసీ సభ్యులు అడ్డుకున్నారు. రూ.2 లక్షలను చెల్లించి చేపలు పట్టుకోవాలని డిమాండ్ చేశారు.



ఇంజినీరింగ్.. ఇక్కడే ఉండాలి..

- చదువులతల్లి ఉన్నా.. విద్యాసౌకర్యాల్లో సున్నా
- ట్రిపుల్‌ఐటీతో ప్రయోజనం అరకొరే
- దూరభారంగానే సాంకేతికవిద్య
- జిల్లాలోనే ఏర్పాటుకు స్థానికుల డిమాండ్

నిర్మల్: కొత్తగా ఏర్పడిన నిర్మల్ జిల్లా ఇప్పుడిప్పుడే ఎదుగుతోంది. చాలారంగాల్లో ఇంకా ఓనమాలు నేర్చుకుంటోంది. ప్రధానంగా చదువుల తల్లి కొలువై ఉన్నా.. ఉన్నత విద్యపరంగా ఇక్కడ పెద్దగా సౌకర్యాలు లేవు. ఉన్న ఒక్క పీజీ కాలేజీని కూడా కాకతీయ యూనివర్సిటీ అధికారులు తరలించారు. ఇటీవలే మెడికల్ కాలేజీ రావడం పెద్ద ఊరట. ఇక బాసరలో ఆర్జీయూకేటీ(ట్రిపుల్‌ఐటీ) ఉన్నా జిల్లా విద్యార్థులకు ప్రయోజనం అరకొరే. ఏడాదికి పది మందికి కూడా అవకాశం రావడం లేదు. ఏటా జిల్లా నుంచి ఇంజినీరింగ్‌వైపు వెళ్లే విద్యార్థుల సంఖ్య వేలల్లో ఉంటోంది. ఈ నేపథ్యంలో సీఎం పర్యటనకు ముందు 'ఇంజినీరింగ్ ఇవ్వండి సారూ..' శీర్షికన 'సాక్షి'లో కథనం ఇచ్చాం. సీఎం సభలో తమ జిల్లాకు ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేయాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కోరారు. దీంతో ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందిస్తూ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేస్తున్నట్లు సభాముఖంగా ప్రకటించారు. దీనిపై జిల్లావ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది. అదేక్రమంలో నిర్మల్‌లోనే ఈ కాలేజీని ఏర్పాటు చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది. రానున్న విద్యాసంవత్సరంలోనే ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.

నిర్మల్‌లోనే బాగుంటుంది..



ఇంజినీరింగ్ కాలేజీని ప్రకటించడం హర్షనీయం. ఆదిలాబాద్, మంచిర్యాల, జగిత్యాలతోపాటు భైంసాప్రాంతానికి నిర్మల్ మధ్యలో ఉంటుంది. ఈనేపథ్యంలో నిర్మల్‌లోనే ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ ముమ్మం రామకృష్ణగౌడ్, భైంసా

దూరభారం తగ్గుతుంది..



ప్రస్తుతం చాలామంది ఇంజినీరింగ్‌వైపే వెళ్తున్నారు. మేము చదివేటప్పుడు దూరభారం సమస్యగా ఉండేది. అందుబాటులో అదికూడా నిర్మల్‌లోనే మంచి కాలేజీ ఏర్పాటుచేస్తే విద్యార్థులకు సమస్యలు తగ్గుతాయి.

– సాయికృష్ణ, సివిల్ ఇంజినీర్, నిర్మల్

విద్యారంగ అభివృద్ధి..



ఇప్పటికీ నిర్మల్ ప్రాంతం విద్యాపరమైన సౌకర్యాల్లో వెనుకబడి ఉంది. ఇటీవల మెడికల్ కాలేజీ రావడం, ఇప్పుడు ఇంజినీరింగ్ కాలేజీని ప్రకటించడం హర్షనీయం. నిర్మల్ ఎడ్యుకేషన్ హబ్ కావాలి.

– మెంగ శ్రీధర్, ప్రిన్సిపాల్, దీక్ష డిగ్రీకళాశాల, నిర్మల్

పేదవిద్యార్థులకు అందుబాటులో.



ఇంజినీరింగ్ కాలేజీ రావడం సంతోషకరమైన విషయం. పేదవిద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లి చదివే పరిస్థితి లేదు. అదే నిర్మల్‌లో ఏర్పాటైతే వారికీ సాంకేతికవిద్య అందుతుంది. ఉద్యోగ అవకాశాలూ వస్తాయి.

– శ్రీనివాస్, ఎమ్మెస్సీ, బీఈడీ, ఖానాపూర్

జిల్లాకు అవసరం..



పిల్లల చదువులు, ఉద్యోగ, ఉపాధి, ఇతరత్రా పనుల కోసం చుట్టూ ఉన్న ప్రాంతాలన్నీ నిర్మల్‌పైనే ఆధారపడి ఉన్నాయి. ఇంజినీరింగ్ కాలేజీ కూడా ఇక్కడ ఏర్పాటు చాలా అవసరం. నిర్మల్ అందరికీ అనువుగా ఉంటుంది.

– పాలకుర్తి కృష్ణ, కడెం

భవిష్యత్తు బాగుంటుంది..




ఇప్పుడంతా ఇంజినీరింగ్‌కే భవిష్యత్తు ఉంది. పిల్లలూ సాంకేతికవిద్యనే ఇష్టపడుతున్నారు. ఈనేపథ్యంలో ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు కావడం చాలా సంతోషం. అది కూడా నిర్మల్‌లోనే ఏర్పాటు చేయాలి.

– వనజ, గృహిణి, నిర్మల్

నిర్మల్‌కు అవసరం..

ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల నిర్మల్‌లోనే ఏర్పాటు చేయాలన్న డిమాండ్ సబబే అంటున్నారు జిల్లావాసులు. ఇందుకు సహేతుకమైన కారణాలను కూడా పేర్కొంటున్నారు.

- బాసర ట్రిపుల్‌ఐటీ ద్వారా జిల్లా విద్యార్థులకు, స్థానిక అధ్యాపకులకూ పెద్దగా ఉపయోగం ఉండటం లేదు. అందులో ఏడాదికి 10–12 మంది జిల్లా విద్యార్థులకు మాత్రమే అవకాశం వస్తోంది.
- నిర్మల్ జిల్లా విద్యార్థులు ఇంజినీరింగ్ చదవాలంటే దాదాపు 250 కి.మీ. దూరంలో ఉన్న హైదరాబాద్ వరకు వెళ్లాల్సి ఉంటుంది. నిజామాబాద్ వెళ్లాలన్నా 80 కి.మీ. దూరం ఉంటుంది. అక్కడా కేవలం రెండు ప్రైవేటు కాలేజీలు మాత్రమే ఉన్నాయి.
- నిర్మల్‌జిల్లా నుంచి ఏటా వేల మంది ఇంటర్ విద్యార్థులు ఇంజినీరింగ్‌వైపు వెళ్తున్నారు. ఇందులో కొంతమంది ఆర్థిక, దూరభారాలతోనే మధ్యలో మానేసి డిగ్రీలో చేరుతున్నారు.
- మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్, ఆదిలాబాద్ ప్రాంతాలకు రైల్వే సౌకర్యం ఉంది. ఆ ప్రాంతవాసులు రాష్ట్రంతోపాటు దేశంలోనే ఏప్రాంతానికైనా సులువుగా చేరుకునే అవకాశం ఉంది. నిర్మల్‌కు రోడ్డు మార్గమొక్కటే ఉంది.
- ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్, నేరడిగొండ తదితర ప్రాంతాలకు నిర్మల్ సమీపంలో ఉంటుంది. ఆదిలాబాద్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలతోపాటు భైంసాప్రాంతానికి మధ్యలో నిర్మల్ ఉంటుంది. నలువైపులా రాకపోకలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల నుంచి ఉద్యోగ, ఉపాధి కోసం వచ్చిన వందలాది కుటుంబాలు నిర్మల్‌లో స్థిరపడ్డాయి.
- 2018 ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్మల్‌కు వచ్చిన సీఎం కేసీఆర్ నిర్మల్ ఎడ్యుకేషన్ హబ్ చేస్తామన్న హామీ ఇచ్చారు.
- జిల్లాకేంద్రంలో ఆదివారం జరిగిన బహిరంగ సభలోనూ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిర్మల్ పేరు చెప్పి మరీ ఇక్కడ ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ కావాలని సీఎం కేసీఆర్‌ను కోరారు.
- ఇంజినీరింగ్ కాలేజీకి కావాల్సిన అనువైన భవనాలు, ప్రభుత్వ స్థలాలూ జిల్లాలో అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో నిర్మల్‌లోనే ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.



గ్రూప్–1కు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 11న నిర్వహించనున్న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష జిల్లాలో సజావుగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ ప్రవీణ్‌కుమార్, అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. వికలాంగులకు నిబంధనల ప్రకారం సౌకర్యాలను కల్పించాలని సూచించారు. స్ట్రాంగ్ రూం నుంచి పరీక్ష కేంద్రానికి, తిరిగి పరీక్ష కేంద్రం నుంచి స్ట్రాంగ్ రూంకు ఎగ్జామ్ మెటీరియల్ తరలించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల్లో 4,489 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, టాయిలెట్స్, తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. పరీక్షకు ముందుగా మాక్ డ్రిల్ నిర్వహించాలని, అభ్యర్థులు గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్ వాచ్, సెల్‌ఫోన్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను అభ్యర్థులు తీసుకురావొద్దన్నారు. హాల్‌టికెట్, ఏదైన ఒరిజినల్ గుర్తింపు కార్డు తీసుకు రావాలని తెలిపారు. పరీక్ష కోసం నలుగురు రూట్ ఆఫీసర్లు, 14 మంది లైజనింగ్ ఆఫీసర్లు, 198 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు వివరించారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జానపద పోటీలు

నిర్మల్ రూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు జానపద పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ భీమారావు తెలంగాణ చరిత్రను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థితికి ఎదగాలన్నారు. పోటీల్లో ప్రథమ స్థానం శిరీష (బీఎస్సీ ఫస్ట్ ఇయర్), ద్వితీయ బహుమతి కృష్ణవేణి గెలుచుకున్నారు. విజేతలకు ఈనెల 9న బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఇందులో సాంస్కృతిక సమన్వయకర్త నరసయ్య, సీనియర్ అధ్యాపకులు రఘుపతి, గణపతి, నాగేశ్వర్, పీజీ.రెడ్డి, డాక్టర్ శంకర్, శ్రీహరి, రజిత, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

చేలల్లో రాజుకుంటున్న నిప్పు



కుంటాలలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు ఆర్పుతున్న రైతులు (ఫైల్)

కాలి బూడిదైన కంకులను చూపిస్తున్న రైతు (ఫైల్)

- విద్యుదాఘాతంతో ప్రమాదాలు
- నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో విఫలం
- ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని కోరుతున్న బాధిత రైతులు

కుంటాల: ఆరుగాలం శ్రమించి పండించిన పంట అగ్నికి ఆహుతవుతున్నా.. నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో విద్యుత్‌శాఖ విఫలమవుతోంది. పంటలపై వేలాడుతున్న విద్యుత్‌తీగలు, పంట చేన్లలోని ట్రాన్స్‌ఫార్మర్‌లతో నిప్పురవ్వలు ఎగిసిపడడంతో పంటలు అగ్నికి ఆహుతై అన్నదాతను ఆర్థిక ఊబిలోకి నెట్టేస్తున్నాయి. సుమారు 45రోజుల వ్యవధిలోని జిల్లాలోని భైంసా, సారంగాపూర్, లోకేశ్వరం, కుంటాల మండలాల్లో విద్యుత్ ప్రమాదాలతో చేతికొచ్చిన పంటలతో పాటు పశుగ్రాసం దగ్ధం కావడంతో అన్నదాతలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లాలో జరిగిన ప్రమాదాలు..

- లోకేశ్వరం మండలంలోని సాత్‌గాం గ్రామానికి చెందిన గోర్ల భూమన్న రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పులు ఎగిసిపడడంతో పంటంతా కాలిపోయి రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లింది.
- భైంసా మండలం కుంసర గ్రామంలో గంగాధర్ పటేల్ మొక్కజొన్న పంట చేనులో ట్రాన్స్‌ఫార్మర్‌కు షార్ట్‌సర్క్యూట్ జరగడంతో 20క్వింటాళ్ల మొక్కజొన్న దగ్ధమైంది.
- సారంగపూర్ మండలంలోని జామ్ గ్రామానికి చెందిన రాజారపు భోజన్న నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేయగా వేలాడుతున్న విద్యుత్ తీగల నుంచి నిప్పు రవ్వలు పంటపై పడడంతో సుమారు రూ.3లక్షల ఆదాయం కోల్పోయాడు.
- సారంగాపూర్ మండలంలోని జాం గ్రామానికి చెందిన కండెల భోజన్న నూర్పిడి చేసేందుకు ఉంచిన మొక్కజొన్న పంటపై ఈదురుగాలులతో నిప్పు రవ్వలు ఎగిసిపడడంతో ఎకరం కాలిపోగా రూ.70వేల వరకు నష్టం వాటిల్లింది.

కంకులు బూడిదయ్యాయి



రబీలో మూడెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేసిన. అధిక దిగుబడులు వస్తాయని నమ్ముకున్న. ఇటీవల ఈదురుగాలులతో వేలాడుతున్న విద్యుత్ తీగలతో నిప్పు రవ్వలు పడడంతో కంకులు కాలిబూడిదయ్యాయి. కన్నీళ్లే మిగిలాయి. – ఆముదారి కృష్ణ, రైతు,కుంటాల

రైతులను ఆదుకోవాలి



విద్యుదాఘాతంతో చేతికొచ్చిన మొక్కజొన్న పంటంతా కళ్లెదుటే కాలిపోయింది. విద్యుత్ ప్రమాదంతో ఏటా పంట కాలిపోతున్నా నష్టపరిహారం ఇవ్వడం లేదు. రూ.లక్షా 70 వేల వరకు ఆర్థికంగా నష్టపోయాను. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– శీల సునీల్, రైతు, అంబకంటి

అప్రమత్తత అవసరం



ఏటా ప్రమాదాలు జరగకుండా విద్యుత్ భద్రత, పాదుపు వారోత్సవాలను నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, వేలాడుతున్న విద్యుత్ తీగలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలి. రైతులు ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి.

– శివప్రసాద్, విద్యుత్ ఏఈ, కుంటాల

కుంటాల మండలంలో...

- మండలంలోని అందాకూర్ శివారులో కుంటాలకు చెందిన పడకంటి దత్తాద్రి రెండెకరాల్లో పంట సాగుచేయగా ప్రమాదవశాత్తు మొక్కజొన్న పంట కాలి రూ.50వేల నష్టం జరిగింది.
- కుంటాల శివారులోని ఒడ్నం కృష్ణ రైతు చేనులో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పు రవ్వలు ఎగిసిపడి మొక్కజొన్న పంట దగ్ధమైంది. గత ఏడాది ఇదే రైతుకు చెందిన మొక్కజొన్న పంట విద్యుదాఘాతంతో కాలిపోయింది.
- కుంటాలకు చెందిన యువ రైతు ఆముదారి కృష్ణ మూడెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేయగా నూర్పిడి చేసేందుకు ఉంచిన కంకులపై పైన ఉన్న విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి తగలడంతో పంట కాలిబూడిదైంది. సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లింది.
- మండలంలోని అంబకంటి శివారులో శీల సునీల్ రైతు హార్వెస్టర్‌తో నూర్పిడి చేసేందుకు ఉంచిన మొక్కజొన్న పంట విద్యుదాఘాతంతో నిప్పంటుకొని రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంట కాలిపోగా రూ.లక్షా70వేలు నష్టం వాటిల్లింది.
- మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన సుంకరి శ్రీనివాస్ రైతుకు చెందిన ఎకరం మొక్కజొన్నపంట, సిరికొండ గంగాధర్, సిరికొండ గణేష్ రైతుల మొక్కజొన్న పంట ప్రమాదవశాత్తు నిప్పంటుకొని కాలిపోయింది.
- కుంటాల మండలంలోని ఓలా శివారులో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించడంతో 20ఎకరాల్లో గడ్డితో పాటు, విద్యుత్ పరికరాలు, మొక్కజొన్న కంకులు దగ్ధమయ్యాయి. బోస్‌పెల్లి మోహన్ రావు, దొనికెన బాపన్న, దొనికెన విట్టల్, మొండి గజేందర్ రైతులు ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.లక్షా 20వేల వరకు నష్టపోయారు.
- కుంటాల మండలంలోని కొత్త వెంకూర్ గ్రామానికి చెందిన మోడెం గంగాధర్ రైతు పంట చేన్లో పశుగ్రాసాన్ని నిల్వ చేసుకున్నాడు. విద్యుత్ తీగలు తగలడంతో పైనుంచి నిప్పురవ్వలు పడి పశుగ్రాసం కాలిపోవడంతో రూ.20వేల నష్టం వాటిల్లింది.

కేసీఆర్ నేతృత్వంలోనే పారిశ్రామిక ప్రగతి

- జెడ్పీ చైర్‌పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మి



అవార్డులు ప్రదానం చేస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం పారిశ్రామికంగా అద్భుతమైన ప్రగతి సాధిస్తోందని, దేశంలోనే తెలంగాణ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని జెడ్పీ చైర్‌పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్మల్‌లోని అంబేద్కర్ భవన్‌లో మంగళవారం తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ వరుణ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభలో జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఒకప్పుడు తెలంగాణ నీళ్లు, కరెంటు లేక పరిశ్రమలు మూసేసిన రోజుల నుంచి నేడు సామాన్యులు సైతం పరిశ్రమలు నెలకొల్పి విజయవంతం అయ్యారన్నారు. 24 గంటలు పరిశ్రమనడిపే విధంగా అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. బయోలాజికల్ పార్కులు, ఫార్మా కంపెనీలు, ఐటీ పరిశ్రమలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే ఎక్కువగా అభివృద్ధి చెందాయన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరాతో పారిశ్రామిక అభివృద్ధి జరుగుతోందన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా పరిశ్రమలకు అవసరమయ్యే నీళ్లు అందిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి జీవీ.నరసింహారెడ్డి, తెలంగాణ పారిశ్రామిక విధానం టీఎస్ ఐపాస్, టీ ప్రైడ్ స్కీం, టీఐడియా స్కీం, తెలంగాణ రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ విధానాలను వివరించారు.

పలువురికి అవార్డులు...

పారిశ్రామిక ప్రగతి ఉత్సవాల్లో పలువురు పారిశ్రామికవేత్తలకు అవార్డులు ప్రదానం చేశారు. జనరల్ కేటగిరీలో అడిగెల కేదారీనాథ్ (జిన్నింగ్), ఎస్సీ విభాగంలో తూర్పాటి వెంకటేశ్, రాథోడ్ నరేందర్(రైస్ మిల్), జాదవ్ రాకేశ్(పారా బాయిల్డ్ రైస్ మిల్), గంగిటి రమ(క్యూరింగ్ పైప్), ముసుకు ప్రవీణ్‌రెడ్డి (హోప్ పైప్), కార్తీక్(యూపీవీసీ విండోస్), గంగాప్రసాద్ (ఫ్లయల్ బ్రిక్స్), సురేష్ యాదవ్ (రైస్‌మిల్), తండ్ర సాయన్న సర్వీసింగ్ విభాగాల్లో అవార్డులు పొందారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, జెడ్పీ సీఈవో సుధీర్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ చంద్రశేఖర్, డీఆర్డీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం ప్రభుత్వమే కొనాలి



కలెక్టర్ చాంబర్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: తడిసిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీజేపీ నాయకులు మంగళవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఆకస్మికంగా నాయకులు కార్యాలయంలోకి చొచ్చుకు వెళ్లారు. కలెక్టర్ చాంబర్ ఎదుట బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, రైతులకు మద్దతుగా నినాదాలు చేశారు. ధాన్యాన్ని తరలించేందుకు ఎక్కువ మొత్తంలో లారీలు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు.

'ఏలేటి'పై కేసు నమోదు

నిర్మల్ టౌన్: కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లి ధర్నా చేయడంతోపాటు ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగేలా నినాదాలు చేసినందుకు మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, అతని అనుచరులపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ మల్లేశ్ తెలిపారు. ఈమేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

తండ్రి అంత్యక్రియలు పూర్తిచేసిన కూతురు


తండ్రి అంత్యక్రియల్లో కూతురు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని పాత ఉట్నూర్‌కు చెందిన డోలి లక్ష్మిపతి (45) అనారోగ్యంతో మృతిచెందగా మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. అయితే లక్ష్మిపతికి కుమారులు లేకపోవడంతో కూతురు ఉమామహేశ్వరి అన్నీతానై అంత్యక్రియలు నిర్వహించింది. దీంతో కుటుంబీకులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఆర్జీయూకేటీకి నిధులు కేటాయించాలని వినతి


మంత్రి హరీశ్‌రావును కలిసిన వీసీ, సిబ్బంది

భైంసాటౌన్: బాసర ఆర్జీయూకేటీకి మరిన్ని గ్రాంట్లు విడుదల చేయాలని వీసీ వెంకటరమణ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి వర్సిటీ పనితీరు, ఇతర విషయాలు వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వీసీ తెలిపారు.

బాసర ఆలయ హుండీ లెక్కింపు



లెక్కిస్తున్న సిబ్బంది

భైంసాటౌన్: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ హుండీని మంగళవారం లెక్కించినట్లు ఈవో విజయరామారావు, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో లెక్కించారు. 69 రోజుల ఆదాయం లెక్కించగా రూ.98,19,191 నగదు, 225 గ్రాముల మిశ్రమ బంగారం, 6.920కిలోల మిశ్రమ వెండి, 26 విదేశీ కరెన్సీ నోట్లు సమకూరినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వైదిక, పరిపాలన సిబ్బంది, ఎస్‌బీ ఐ సిబ్బంది, బాసర పోలీసు సిబ్బంది, వాగ్దేవి సొసైటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

కడెం: ఈత సరదా ఓ బాలుడి ప్రాణం తీసింది. కడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని (ఖానాపూర్ మండలం) సింగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గొండుగూడకు చెందిన కుమురంభీం (12) వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. ఎస్సై రాజు వివరాల ప్రకారం.. కొమురంభీం స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు పశువులకు నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఈత కొట్టేందుకు బావిలె దిగారు. భీంకు ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. కొమురంభీం తల్లిదండ్రులు గతంలో మృతిచెందడంతో తన చెల్లి, అన్న ముగ్గురు బంధువుల ఇంట్లో ఉంటున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వెల్లివిరుస్తున్న ఆధ్యాత్మికత



ఆదిలాబాద్: శ్రీఆంజనేయ నామ పారాయణం... ధైర్యానికి.. బలపరాక్రమానికి ప్రతీక. జైశ్రీరామ్ అని అనునిత్యం శ్రీరామచంద్రుడి నామ జపం చేసే ఆ హనుమాన్ దేవునిపై భక్తిభావం పొంగిపొర్లుతోంది. దేశంలో వాయుపుత్రుని ఆలయం లేని గ్రామాలు చాలా అరుదు. పల్లెల్లో గుడి చిన్నదైన ఆంజనేయున్ని కొలవడానికి భక్తులు అధిక ప్రాధాన్యతనిస్తారు. భూత, ప్రేత, పిశాచాలను దూరం తరిమి వేయడానికి, ఊరును కాపాడడానికి అంజనీపుత్రుడు అండగా నిలుస్తాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే ఏ ఊరిలో చూసినా ఆ రామబంటు ఆలయాలు కనువిందు చేస్తాయి. ఈ క్రమంలోనే రోజురోజుకూ ఆంజనేయునిపై భక్తి ఆకాశాన్ని తాకుతుంది. మనసులో కొలువైన అంజనీపుత్రునిపై భక్తి భారీ విగ్రహాల రూపంలో కొలువుదీరుతుంది.

- పల్లె, పట్టణాల్లో భారీ హనుమంతుడి విగ్రహాలు..
- ఐక్యంగా భక్తిశ్రద్ధలతో పూజలు

మహాలక్ష్మివాడలో ఇటీవల ప్రతిష్ఠించిన 45 అడుగుల భారీ అంజనేయ స్వామి విగ్రహం

ఉమ్మడి జిల్లాలోనే ఎత్తైన 'సంకట హరణ హనుమాన్'

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 45 అడుగుల భారీ ఆంజనేయ స్వామి విగ్రహం ఆకట్టుకుంటుంది. ఆగస్టు 8 2020 తేదీన ప్రారంభమైన ఈ విగ్రహ నిర్మాణ పనులు మూడు సంవత్సరాల పాటు కొనసాగాయి. స్థానిక కాలనీవాసులు దాతల సహాయంతో రూ.25 లక్షల వ్యయం చేసి ఈ భారీ హనుమంతుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవల మే 31 తేదీన ఈ భారీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. వెండి వర్ణంలో దగదగా మెరిసిపోతూ దర్శనమిస్తున్న శ్రీ ఆంజనేయస్వామి ప్రతిమను మహారాష్ట్రలోని హిమాయత్ నగర్ నుంచి వచ్చిన కళాకారులు తీర్చిదిద్దారు. జిల్లాలో భక్తి భావం వెల్లివిరియాలని, ఆధ్యాత్మికతను ప్రజల్లో పెంపొందించాలనే భావనతో ఈ భారీ ప్రతిమను ఏర్పాటు చేయడం జరిగిందని సంకటహరణ హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు వెల్లడిస్తున్నారు. ఇదిలా ఉంటే ఇటీవల భారీ హన్‌మాన్ విగ్రహాల ప్రతిష్ఠాపన సంప్రదాయంగా మారింది. ఇప్పటి వరకు ఆలయాలను నిర్మించి అందులో విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజించే ఆనవాయితీకి విభిన్నంగా ప్రజలు విగ్రహాలను నిర్మిస్తున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా భారీ హన్‌మాన్ విగ్రహాలను గ్రామం, పట్టణమనే తేడా లేకుండా ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేస్తున్నారు. శ్రీరామ నవమి, హన్‌మాన్ జయంతి సందర్భంగా గ్రామస్తులంతా ఐక్యమత్యంతో హన్‌మాన్ భారీ ప్రతిమల వద్ద వేడుకలను నిర్వహిస్తుండడంతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురికి జైలు

కడెం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన నలుగురికి ఖానాపూర్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ జితిన్‌కుమార్ రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని ఎస్సై కొసన రాజు తెలిపారు. ఇటీవలే డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 27మందిని మంగళవారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా 23 మందికి రూ.50వేల జరిమానా విధించారు. అలాగే మార్కరి రాకేష్, మేకల శంకర్, కొండరి శంకర్, మంజులరెడ్డిలకు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. ఈ మేరకు వారిని నిర్మల్ జైలుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బావిలోపడి ఒకరు మృతి


జాడే రమేశ్ (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన జాడే రమేశ్ (17) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... తాండ్ర గ్రామానికి చెందిన జాటు గాజీరాంకు ఐదుగురు సంతానం. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్ద కుమారుడు జాటు రమేశ్ రోజులాగే సోమవారం మేకలు మేపడానికి వెళ్లి ఎండ వేడికి చెట్టు కింద మేకల మంద పెట్టి కాసేపు సేదా తీరాడు. అనంతరం సమీపంలోని బావి దగ్గరకు నీళ్లు తాగేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడిపోయి మృతి చెందాడు. సాయంత్రం మేకలు ఇంటికి వెళ్లినా రమేశ్ రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గాలిస్తూ బావి దగ్గరకు వెళ్లగా మృతిచెంది కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మంగళవారం మృతదేహాన్ని బయటకు తీసి పంచనామ నిర్వహించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దిలీప్ పేర్కొన్నారు.

మానవత్వం చాటిన మంత్రి పీఏ

సాక్షి స్పందన

కడెం: మానవత్వం చాటాడు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పీఏ కృష్ణంరాజు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపరేషన్‌కు డబ్బులు లేక ఏడాదిగా మంచానికి పరిమితమైన మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామానికి చెందిన నాంపెల్లి మల్లేశ్ దీనగాథను 'నా కొడుకును కాపాడండి' అనే శీర్షికన సాక్షి ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన మంత్రి పీఏ కృష్ణంరాజు మంగళవారం కొత్త మద్దిపడగ గ్రామాని వెళ్లి మల్లేశ్‌ను పరామర్శించారు. మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, ఐదు వేల రూపాయలు అందజేశారు. ప్రతి నెలా మందుల ఖర్చు, ఆపరేషన్‌కు సైతం సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పంబాల భీమన్న, భోగ కిషన్, భీమేష్, రాజన్న, బొమ్మెన రాకేష్, కాలేరి దివాకర్, రవి, సచిన్ ఉన్నారు.


మల్లేశ్‌ను పరామర్శిస్తున్న కృష్ణంరాజు

విధి కాటేసింది..

- గుండెపోటుతో యువకుడి మృతి
- తండ్రి చనిపోయిన ఆరునెలలకే కొడుకు
- ఒంటరిగా మిగిలిన తల్లి

ఉట్నూర్‌రూరల్: కాయకష్టం చేసి కులవృత్తి మేదరి పనిచేసుకుంటూ ఒక్కగానొక్క కొడుకును ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్నారు. సంతోషంగా ఉంటున్న ఆ కుటుంబాన్ని విధి వక్రీకరించింది. ఆరు నెలల క్రితం తండ్రి అనారోగ్యంతో మృతిచెందగా.. సోమవారం రాత్రి కొడుకు గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో ఆ తల్లి గుండెల్ని కదిపివేసింది.. భర్త చనిపోయిన సంఘటన మరువక ముందే, ఒక్కగానొక్క కుమారుడు దూరం కావడంతో ఆ తల్లి బాధ వర్ణనాతీతంగా మారింది.


వేముల వెంకటేశ్ (ఫైల్)

మండల కేంద్రానికి చెందిన వేముల వెంకటేశ్ (30) సోమవారం రాత్రి ఒక్కసారిగా ఆరోగ్యస్థితి విషమించడంతో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు రిమ్స్‌కు రెఫర్ చేశారు. ఆసుపత్రికి తరలించే క్రమంలో పరిస్థితి విషమించి గుండెపోటుతో మృతి చెందాడు. వెంకటేశ్ పెయింటింగ్ పనులు చేస్తూ తల్లికి ఆసరాగా ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న బీజేపీ యువనాయకులు రితేశ్ రాథోడ్ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.

బాలిక విద్యకు భరోసా


లక్ష్మణచాందలోని కేజీబీవీ విద్యాలయం

- కేజీబీవీల్లో ప్రవేశాలు ప్రారంభం
- జిల్లాలో మొత్తం కేజీబీవీలు 18
- పది ఫలితాల్లో నిర్మల్ కేజీబీవీల్లో 98.99శాతం
- రాష్ట్రంలోనే మొదటి స్థానం కైవసం

జిల్లా సమాచారం...

మొత్తం కేజీబీవీ విద్యాలయాలు	18
మొత్తం కేజీబీవీ కళాశాలలు	10
6వ తరగతిలోని సీట్లు	720
ఇంటర్ ఫస్టియర్‌లోని సీట్లు	800

లక్ష్మణచాంద: చదవాలనే ఆకాంక్ష ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో చాలా మంది నిరుపేద కుటుంబాలకు చెందిన బాలికలు మధ్యలోనే బడి మానేస్తుంటారు. మరి కొందరికి సమీపంలో పాఠశాలలు, కళాశాలలు లేక ఇతర ప్రదేశాలకు బాలికలను పంపేందుకు తల్లిందండ్రులు ససేమిరా అనడంతో మధ్యలోనే బడి మానేస్తున్నారు. అటువంటి బాలికలను అక్కున చేర్చుకుని పేద, మధ్య తరగతికి చెందిన బాలికలకు భరోసానిస్తూ కార్పొరేట్ హంగులతో కూడిన వసతితో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి జిల్లాలోని కేజీబీవీ బాలికల విద్యాలయాలు.

ప్రవేశాలు ప్రారంభం...

2023- 24 విద్యాసంవత్సరానికి సంబంధించి జిల్లాలోని కేజీబీవీలలో ఆరవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 18 కేజీబీవీ బాలికల విద్యాలయాలు ఉండగా ఇందులో 6వ తరగతిలో 720 సీట్ల కోసం, 10 కేజీబీవీ బాలికల కళాశాలలు ఉండగా ఇంటర్ మొదటి సంవత్సరంలో 800 సీట్ల కోసం ప్రవేశాలు మే 25 నుంచే మొదలయ్యాయి.

ఇంటర్‌లో గ్రూపులు....

జిల్లాలోని 10 కేజీబీవీ కళాశాలలో పలు రకాల గ్రూపులు బాలికలకు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ముఖ్యంగా ఎంపీసీ, బైపీసీ గ్రూపులు లక్ష్మణచాంద, దిలావార్‌పూర్, జామ్, నర్సాపూర్, భైంసా, దస్తురాబాద్ కేజీబీవీల్లో అందుబాటులో ఉన్నాయి. అలాగే సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూపులు మామడ, కడెం, నిర్మల్‌రూరల్ కేజీబీవీలలో ఉన్నాయి.

ఆంగ్ల మాధ్యమంలో....

జిల్లాలోని కేజీబీవీలలో 6-10 తరగతుల్లో జామ్, లోకేశ్వరం, దిలావార్‌పూర్ ఆంగ్లమాధ్యమం సౌకర్యం ఉంది. ఇంటర్‌లో ఆంగ్ల మాధ్యమంలో చేరాలనే వారికి పెంబి, నర్సాపూర్(జీ), సోన్, నిర్మల్ రూరల్, దస్తురాబాద్ కేజీబీవీలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరే వారికి అందుబాటులో ఉందని సెక్టోరియల్ అధికారి శ్రీదేవి తెలిపారు.

సకల సౌకర్యాలు....

జిల్లాలోని కేజీబీవీ విద్యాలయాల్లో అన్ని రకాల సదుపాయాలు సమకూర్చారు. ఇందులో విశాలమైన తరగతి గదులు, క్రీడా మైదానం, ల్యాబ్ సౌకర్యం, ఇంటిని మైమరిపించే మూడు పూటల నాణ్యమైన పోషకల భోజనం, అంకితభావం, నిరంతరం విద్యార్థుల అభివృద్ధికి కృషి చేసే ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యాబోధన స్టడీ అవర్ నిర్వహణ ఉంటుంది.

అత్యుత్తమ ఫలితాలు....

జిల్లాలోని కేజీబీవీలు అటు పాఠశాలతో పాటు ఇటు కళాశాలలు కూడా అత్యుత్తమ ఫలితాలు సాధించాయి. రాష్ట్రంలోని 33 జిల్లాలో 10వ తరగతి ఫలితాల్లో నిర్మల్ కేజీబీవీలు 98.99 శాతం పాస్‌తో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచాయి. జిల్లాలోని 18 కేజీబీవీలలో 98.99 శాతం, ఇందులో 14 కేజీబీవీలు 100శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇందులో ఆరుగురు బాలికలు 10 జీపీఏ సాధించారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరంలో 92 శాతం, రెండో సంవత్సరంలో 93 శాతం సాధించాయి.

బోధన బాగుంది..



కేజీబీవీలలో అంకితభావం పనిచేసే ఉపాధ్యాయులతో విద్యా బోధన చేస్తున్నారు. నిత్యం ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో స్టడీ అవర్ నిర్వహణ ఉంటుంది. ఇంటర్ ఎంపీసీ విభాగంలో 935 మార్కులు సాధించాను.

– స్నేహ, ఇంటర్ విద్యార్థిని, లక్ష్మణచాంద, కేజీబీవీ

10 జీపీఏ సాధించాను



కేజీబీవీలలో అంకిత భావం గల ఉపాధ్యాయులు ఉత్తమ విద్యను బోధిస్తున్నారు. దీంతో ఇటీవల ప్రకటించిన 10 ఫలితాలలో 10 జీపీఏతో మండల టాపర్‌గా నిలిచాను.

– హంసిని, పెంబి కేజీబీవీ

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో 18 కేజీబీవీ బాలికల విద్యాలయాలు, 10 కేజీబీవీ బాలికల కళాశాలలు ఉన్నాయి. ప్రస్తుతం 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ప్రవేశాలు తీసుకుంటున్నాం. విద్యతో పాటు, బాలికలను పలు రకాల వృత్తి నైపుణ్యాల కోర్సులు, యోగా, కరాటే నేర్పుతున్నాం. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీదేవి, సెక్టోరియల్ అధికారి

కూలీల కొరత.. రైతులకు భారం


ధాన్యం బస్తాలు కుడుతున్న రైతు

కుంటాల: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులకు తిప్పలు తప్పడం లేదు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో కుంటాలలో మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కూలీలు లేక కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పేరుకుపోవడంతో రైతులు రోజుల తరబడి పంట నిరీక్షించాల్సి వస్తోంది. ధాన్యం తూకం వేసేందుకు సరిపడా కూలీలు లేక రైతులే తూకం వేసుకోవాల్సిన పరిస్థితి. దీనికి తోడు తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు కూడా లేకపోవడం రైతులకు శాపంగా మారింది. రైతులే ధాన్యాన్ని తూకం వేసి బస్తాలను కుట్టేసి ట్రాక్టర్లలో మిల్లులకు తరలిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఆర్థికభారం పడుతోందని దిగులు చెందుతున్నారు. రైతులే తూకం వేసి మిల్లులకు తరలించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి కూలీల కొరత తీర్చి తగినన్నీ లారీలను సమకూర్చాలని రైతులు వేడుకుంటున్నారు.

రాష్ట్ర స్థాయి ఇన్నోవేషన్‌కు దిలావర్‌పూర్ విద్యార్థులు


ఎం.హారిక


హరిచందన

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ విద్యార్థినిలు తమదైన శైలిలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందుతున్నారు. ఈ నేపథ్యంలోనే 2022–23 స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ పోటీలకు నిర్మల్ జిల్లా నుంచి ఒక ఆలోచన విధానంతో దిలావర్‌పూర్ కేజీబీవీ విద్యార్థినులు ఎంపికయ్యారు. ఇందులో ఎం.హారిక, హరిచందన, సాయిపూజ, మనూషలు ఉన్నారు. వారు రూపొందించిన నూతన ఆలోచన విధానమైన ఎక్సిపీరియడ్ మెడిసిన్ ఇండిగేటర్ విశ్లేషనతో జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు జిల్లా విద్యాధికారి రవీందర్, సైన్స్ అధికారి వినోద్ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర పరిధిలో మొత్తం 70 ఆలోచనలు ఎంపికవగా అందులో నిర్మల్ జిల్లా నుంచి మొదటి స్థానంలో దిలావర్‌పూర్ కేజీబీవీ విద్యార్థినిలు ఉండడం గర్వకారణంగా ఉందని ఎస్‌వో అపర్ణ, జెండర్ కోఆర్డినేటర్ శ్రీదేవి తెలిపారు. వీరు ఈ నెల 20 నుంచి 22వరకు రాష్ట్ర స్థాయిలో జరిగే ఇన్నోవేషన్ పోటీల్లో పాల్గొంటారని ఎస్‌వో తెలిపారు.

'గురుకుల పాఠశాలకు విద్యార్థుల ఎంపిక


మాట్లాడుతున్న ఏపీవో పీవీటీజీ అత్రం భాస్కర్

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గిరిజన గురుకుల జూనియర్ కళాశాల (పివిటిజి) బాలురు, బాలికల ప్రవేశం కోసం మంగళవారం ఉట్నూర్‌లోని స్థానిక కేబీ కాంప్లెక్స్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి కొలాం, తోటి, మన్నె తెగలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. హయాత్‌నగర్ బాలికల కాలేజీలో బైపీసీ 28, ఎంపీసీ 01, సీఈసీ ఐగురు ప్రవేశం పొందారు. బాలుర కళాశాలకు బైపీసీ 11, ఎంపీసీ 20, సీఈసీ 9 మంది ప్రవేశాలు పొందారు. ఈ కార్యక్రమానికి ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులందరూ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. గిరిజన గురుకులాల ప్రాంతీయ సమన్వయాధికారి వి.గంగాధర్ అధ్యక్షత వహించగా బాలుర కళాశాల, హయాత్‌నగర్‌లోని ప్రిన్సిపాల్ యాదగిరి, వైస్ ప్రిన్సిపాల్ కేశవులు, బాలికల కళాశాల హయాత్‌నగర్ సిబ్బంది కుమార స్వామి, మల్లేశ్, మహేశ్, స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ సుమలత పాల్గొన్నారు.